# సాక్షి పల్నాడు

గురువారం । 12 । డిసెంబర్ । 2024






## కంది పైరు పరిశీలన

కారెంపూడి: సాభాగ్య 133-33 కంది వంగడాన్ని సాగు చేసిన పొలాన్ని గుంటూరు లాం ఫాం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. రైతుకు సూచనలు చేశారు.



## సత్తెమ్మతల్లి దర్శనం

అచ్చంపేట: మాదిపాడు అటవీప్రాంతంలో సత్తెమ్మ తల్లిని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆయనకు స్వాగతం పలికారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 582.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## న్యూస్‌రీల్

### ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ జడ్జి పరిశీలన



నకరికల్లు: పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది పని తీరు అభినందనీయమని తెలంగాణ రాష్ట్రం దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్.హరీష్‌బాబు చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ జి.కాశయ్యతో మాట్లాడి శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో అనుసంధానంగా పంచాయతీరాజ్ సిబ్బంది పనితీరు ప్రజలకు చేరువగా ఉందన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 14న జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా 50వ జూనియర్స్ బాలుర, బాలికల కబడ్డీ జట్టు ఎంపికలను ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన సూచించారు.

### సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

బాపట్ల: బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న వారికి సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్లల్లోపు వారు ఈనెల 15వ తేదీలోపు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఏడాదిన్నరపాటు ఏదైనా హాస్పిటల్‌లో పనిచేసిన అనుభవంతో పాటు సౌదీ అరేబియాలో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 8978886348, 9866637945, 9988853335 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### సూర్యలంక బీచ్ అభివృద్ధికి కృషి



బాపట్ల: పట్టణంలోని సూర్యలంక బీచ్‌ని స్థానిక శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తూ, దేశ విదేశాల నుంచి పర్యాటకుల్ని ఆకర్షించడానికి, రాష్ట్ర పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసి, ఆర్థిక వృద్ధికి దోహదపడే లక్ష్యంతో పర్యాటకాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తిస్తూ జీవో విడుదల చేసినట్లు వివరించారు. సూర్యలంకని విశాఖ బీచ్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ కూడా కొన్ని సూచనలు తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. పర్యాటక అభివృద్ధి సంస్థ తరఫున సూర్యలంక బీచ్‌ని రాష్ట్రంలో అగ్రగామి బీచ్‌గా తయారు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తామని వివరించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ ఆధ్వర్యంలో సూర్యలంక బీచ్ అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు అంగిరేకుల వరప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల్లో అలసత్వం తగదు

చీరాల టౌన్: వలసలు నిర్మూలించి ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాల కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. చీరాల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాపట్ల జిల్లా పరిధిలోని 25 మండలాలకు చెందిన ఎన్ఆర్ఈజీఎస్ అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బందితో పీడీ సమీక్ష నిర్వహించారు. పనుల్లో అలసత్వం తగదన్నారు.

# 24/7 బ్లడ్ సెంటర్

## సకల సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధం

- నరసరావుపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు
- జబ్బుల్లేని నాణ్యమైన రక్తం అందజేతకు ఏర్పాట్లు
- ప్లేట్‌లెట్స్, ప్లాస్మా సంచులూ అందుబాటులో..
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు ప్రాంత అభివృద్ధికి అడుగులు పడ్డాయి. 2022 ఏప్రిల్‌లో పల్నాడు జిల్లాను ఏర్పాటు చేసిన అప్పటి ప్రభుత్వం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 200 పడకలతో జిల్లా ప్రభుత్వ వైద్యశాల నిర్మించి కావాల్సిన హంగులన్నీ సమకూర్చింది. దీనిలోభాగంగా మూడోఫ్లోర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కాంపోనెంట్ బ్లడ్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులిచ్చి శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో సెంటర్ ఏర్పాటు నిలిచింది. మళ్లీ ఇప్పటికి ఆ యత్నాలు ఫలించాయి. సుమారు ఏడాదిన్నరగా రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు దాతలు, ప్రభుత్వ సహకారంతో సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో బ్లడ్‌సెంటర్‌కి కావాల్సిన వసతులన్నీ సిద్ధం చేసుకుని డ్రగ్ లైసెన్స్ పొంది గతనెల నుంచి ట్రయల్ రన్ చేపట్టారు. ఈ సెంటర్‌కు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంపీ నిధుల నుంచి చెరో రూ.5 లక్షలు అందజేశారు. అయోధ్యరామిరెడ్డి మరో రూ.5 లక్షలు అందజేసేందుకు అంగీకారం తెలిపారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక డాక్టర్‌గా బ్లడ్‌సెంటర్ ఆవశ్యకతను గుర్తించి దీని ఏర్పాటుకు తోడ్పాటు అందజేశారు. ఈ బ్లడ్ సెంటర్‌ను ఈనెల 13న ప్రారంభానికి సిద్ధం చేశారు.

**బ్లడ్ సెంటర్ ప్రత్యేకతలెన్నో..!**

- గుంటూరులో తప్పితే మరెక్కడా లభ్యంకాని కాంపోనెంట్స్‌తో కూడిన రక్తాని పల్నాడు జిల్లా ప్రజలకు ఈ సెంటర్ ద్వారా అందివ్వబోతున్నారు.
- ఏ రోగికైనా ప్లేట్‌లెట్స్ కావాల్సి వస్తే ఇప్పటి వరకు హడావుడిగా గుంటూరుకు పరిగెత్తాల్సి వస్తోంది. ఇకపై ఆ బాధ ఉండదు. ఈ సెంటర్‌లోనే ప్లేట్‌లెట్స్ లభిస్తాయి.
- ప్లేట్‌లెట్స్‌తోపాటు రక్తం నుంచి ప్లాస్మాను విభజించి ఇస్తారు. దీనికోసం రెండు ల్యాబ్‌లు ఇక్కడ పనిచేస్తాయి.
- రోగి తరఫు బంధువుల నుంచి రక్తం తీసుకోకుండానే(విత్‌అవుట్ రీప్లేస్మెంట్) విధానం ద్వారా ఇక్కడ రక్తాన్ని అందుబాటులో ఉంచనున్నారు.
- రక్తానికి అన్ని రకాల పరీక్షలు చేసి జబ్బులకు ఆస్కారం లేని రక్తాన్నే సరఫరా చేయనున్నారు. దీంతో పాటు ఎలీసా టెస్ట్ చేయనున్నారు.
- ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులు ఒక్కో రక్త సంచికి రూ.1,500 వసూలు చేస్తుంటే ఈ బ్లడ్ సెంటర్ ద్వారా కేవలం రూ.1,000కే అందజేయనున్నారు.
- 24 గంటలూ ఈ బ్లడ్‌సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉండనుంది.
- ఈ బ్లడ్‌సెంటర్‌కు వచ్చిన రక్తాన్ని మైనస్ 78 డిగ్రీల వద్ద ఉంచి ఏడాదిపాటు చెడిపోకుండా కాపాడతారు.



బ్లడ్‌సెంటర్‌లో పరీక్షల ల్యాబ్





ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన బ్లడ్‌సెంటర్



రక్త నిల్వల కోసం సమకూర్చిన ఫ్రిడ్జ్

### రేపు అధికారికంగా ప్రారంభం



ఈనెల 13న ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టి రవికుమార్ చేతుల మీదుగా ఈ బ్లడ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం గుంటూరు రోడ్డులోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్ ఆవరణలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రారంభోత్సవంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొంటారని వివరించారు. మీడియా సమావేశంలో రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్లు రెహమతుల్లా, సృజన, శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

### బ్లడ్ కోసం 92814 10108ను సంప్రదించండి



ఈ కాంపోనెంట్ బ్లడ్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుంది. ఈ సెంటర్‌లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ముగ్గురు టెక్నీషియన్లు పనిచేయనున్నారు. బ్లడ్ అవసరమైన వారు 92814 10108ను సంప్రదించవచ్చు.

– డాక్టర్ మురళీధర్, బ్లడ్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్

- సెంటర్‌లో రక్తదాతలు డాక్టర్ల పర్యవేక్షణలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన చాంబర్లూ ఏర్పాట్లు చేశారు.
- బ్లడ్ సెంటర్‌కు అవసరమైన మెడికల్ పరికరాలు కొన్నింటిని జర్మనీ నుంచి, మరికొన్నింటిని అమెరికా నుంచి తీసుకొచ్చారు.

### సంకల్ప బలంతో అన్నింటా విజయం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- హనుమత్ వైభవంపై చీరాలలో ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు



చీరాల అర్బన్: సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో స్థానిక పావరాజుతోటలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో హనుమత్ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు రెండో రోజు బుధవారంతో ముగిశాయి. ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని, అందుకు హనుమంతుడే నిదర్శమని తెలిపారు. హనుమంతుడికి ఉన్న సంకల్పదీక్ష, కార్యదక్షత అందరూ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ప్రతి మనిషిలో కూడా తెలియని బలం ఉంటుందని, లంకకు చేరుకోవడానికి సముద్రాన్ని దాటే శక్తి హనుమంతుడికే ఉందని అందరూ చెప్పారని తెలిపారు. రామనామం మనసులో తలచుకొని, తనలోని బలంతో వాయువేగంతో సముద్రాన్ని దాటారని వివరించారు. మనలోని శక్తిని తక్కువగా చూడకుండా మనోసంకల్పంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. రామనామ జపం ఎక్కడ ఉంటే అక్కడ హనుమంతుడు కొలువుదీరతాడని, అందరూ ఆధ్యాత్మిక చింతనతో జీవనం సాగించాలని చాగంటి సూచించారు. మార్గశిర మాసంలో దశమి, ఏకాదశి పర్వదినాల్లో చీరాల ప్రాంతంలో హనుమత్ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఇవ్వడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనాలను వినేందుకు చీరాల పరిసర ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు హాజరయ్యారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ఇక సాగు నీటి సమరం

సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ప్రభుత్వం వీటి ఎన్నికలకు నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసింది. ఈ నెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ఇందులో ప్రకటించలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోని సాగునీటి సంఘాల వ్యవస్థను మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చినట్టయింది. వాస్తవానికి ఈ నెల 5న రావాల్సిన నోటిఫికేషన్ ఆలస్యంగా విడుదలైంది.

- 14, 17 తేదీల్లో సంఘాలకు ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ
- కృష్ణా పశ్చిమ డెల్టాలో సన్నాహాల్లో అధికారులు



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఆ ఆయకట్టు ఉండేది. ఇందులో అత్యధిక విస్తీర్ణం తెనాలి డివిజనులో ఉండేది. జిల్లాల విభజన అనంతరం ఇప్పుడు పశ్చిమ డెల్టా పరిధి గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు విస్తరించింది. ఆ ప్రకారం ఇప్పుడు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ కొంతకాలంగా జరుగుతూ వస్తోంది. పశ్చిమ డెల్టాలో మొత్తం 144 సాగునీటి వినియోగదారుల సంఘాలను నిర్ణయించారు. వీటిలో గుంటూరు జిల్లాలో 50, బాపట్ల జిల్లాలో 92, ప్రకాశం జిల్లాలో రెండు చొప్పున ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 20 కాగా, జిల్లాలో ఆరు, బాపట్ల జిల్లాలో 14 ఉన్నాయి. గుంటూరు చానల్ పరిధిలో మరో 14 సాగునీటి సంఘాలు, రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. వీటన్నింటిపైన ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. సాగునీటి సంఘాల ఎన్నికలకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షిస్తారు. మూడు జిల్లాలకు ముగ్గురు నోడల్ అధికారులను నియమించారు. జిల్లాకు జలవనరుల శాఖ గుంటూరు ఈఈ కె.రమేష్, బాపట్లకు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీరు పులిపాటి వెంకటరత్నం, ప్రకాశం జిల్లాకు జలవనరుల శాఖ ఏఈఈ శంకరరావు నియమితులయ్యారు.

**చురుగ్గా ఏర్పాట్లు**

కృష్ణా డెల్టా పరిధిలోని పశ్చిమ డెల్టాలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు గత నెల మూడో వారంలో నిర్వహించారు. మిగతా ఏర్పాట్లకు సంబంధించిన సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలను నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికలు రెండు విభాగాలుగా జరుగుతాయని అధికారులు తెలియజేశారు. ఉదయం టీసీ సభ్యుల (ప్రాదేశిక సభ్యులు) ఎన్నిక ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. ప్రాజెక్టు కమిటీ ఎన్నికను నోటిఫికేషన్‌లో ప్రస్తావించలేదు.



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ

### సజావుగా నిర్వహిస్తాం



సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14, 17 తేదీల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా తగిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ తరగతులు పూర్తి చేశాం.

– పులిపాటి వెంకటరత్నం, ఎస్ఈ, జల వనరుల శాఖ

### ఎన్నిక విధానం ఇలా...

కృష్ణా పశ్చిమ డెల్టాలోని నీటి సంఘాల్లో 3.5 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18 ఏళ్ల వయసు కలిగినవారు ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ప్రభుత్వ ఉద్యోగి/పింఛనుదారు పోటీకి అర్హులు కారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు, పారితోషికాలు పొందేవారు అనర్హులు. ఎన్నికల్లో పోటీచేసేవారు నీటిశిస్తు చెల్లించి ఉండాలనే నిబంధన ఉంది. ఇక ఎన్నికలను మూడు విధాలుగా జరుపుతారు. తొలుత అక్షరమాల ప్రకారం అభ్యర్థుల వరుసక్రమాన్ని నిర్ణయిస్తారు. ముందుగా ఏకగ్రీవం అవుతుందేమో చూస్తారు. లేకుంటే అభ్యర్థుల వరుసక్రమం ప్రకారం తొలి అభ్యర్థిని వేదికపైకి పిలిచి చేతులు పైకెత్తే విధానంలో ఎన్నిక జరుగుతుంది. ఎవరికి ఎక్కువ మద్దతు వస్తే వారిని విజేతలుగా ప్రకటిస్తారు. చేతులెత్తే విధానం వీలుపడకపోతే రహస్య బ్యాలెట్‌ను అనుసరిస్తారు. ఓటు చేసే రైతులకు పట్టాదారు పాసు పుస్తకం లేకపోయినా ఓటు హక్కును నిరాకరించరు. ఓటరు కార్డు, ఆధార్ కార్డు లేదా ఏ ఇతర గుర్తింపు కార్డుతోనైనా ఓటు చేసే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

### • యమకంకర



అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి ప్రమాదకరంగా మారింది. పలు ప్రదేశాలను డేంజర్ స్పాట్లుగా అధికారులు గుర్తించారు. దీనికితోడు టిప్పర్ వాహనాల నిర్లక్ష్యం వల్ల మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. కంకర (చిప్స్)ను టిప్పర్లతో తరలిస్తున్న క్రమంలో ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోకపోవడంతో రాళ్లు జారి కుప్పలుకుప్పలుగా రోడ్డుపై పడుతున్నాయి. దీంతో కార్లు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారిపోతున్నాయి. ప్రధానంగా మలుపుల వద్ద వాహనాలు తిరగడం కష్టంగా ఉంది. ఫలితంగా వాహనదారులు స్కిడ్ అయి పడిపోయి గాయాలపాలవుతున్నారు. టిప్పర్ల యజమానులు జాగ్రత్తలు తీసుకునేలా పోలీస్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. – నకరికల్లు



### యార్డుకు 51,004 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 51,004 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,509 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,119 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

యడ్లపాడు: ఇంట్లో ఒంటరిగా ఉన్న వద్ధురాలి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని యువకుడు తెంచుకుపోయిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని సందెపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు ఊటుకూరి అనసూయమ్మ ఇంట్లో ఒంటరిగా మంచంపై నిద్రిస్తుండగా బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి 'మీ అబ్బాయితో పనుంది ఇంట్లో ఉన్నాడా' అంటూ అడిగారు. లేదని అనసూయమ్మ చెప్పడంతో 'అయితే పెన్ను పేపర్ ఇవ్వండి మా ఫోన్ నంబర్ రాసిస్తాం. వచ్చాక అబ్బాయి చేత ఫోన్ చేయించండి' అంటూ నమ్మ బలికారు. మంచం మీద ఉన్న వృద్ధురాలు కిందికి దిగి పేపరు, పెన్నును వెతికే క్రమంలో ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసును ఇద్దరూ లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు యడ్లపాడు పోలీసులను ఆశ్రయించారు.

## అంగలేరు వాగులో పడి యువకుడి మృతి



శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామంలో గేదెలను పొలానికి తోలుకుని వెళుతుండగా మార్గమధ్యంలో అంగలేరు వాగులో పడి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన దావులూరి హరీష్ (20) గేదెలను పొలానికి మేత కోసం తోలుకొని వెళుతుండగా గ్రామ సమీపంలో ఉన్ననటువంటి అంగలేరు వాగు మధ్యలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు, వీఆర్వో ఉప్పలూరి మంగయ్య పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రయోగాలతో విప్లవాత్మక ఫలితాలు



చేబ్రోలు: కొత్త ప్రయోగాలతో విప్లవాత్మక ఫలితాలు వస్తాయని ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ పద్మశ్రీ వీకే సింగ్ అన్నారు. కర్బన ఉత్ప్రేరిత చర్యల ద్వారా విప్లవాత్మక ఫలితాలను సాధించవచ్చునని చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'జాయింట్ ఇండో– ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపరరీ విస్టాస్ ఇన్ అప్లైయింగ్(ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల సెమినార్‌ను బుధవారం ప్రారంభించారు. తొలుత బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ వీకే సింగ్ మాట్లాడుతూ.. క్రియేటివిటీ ద్వారా పర్యావరణ అనుకూల కాటలిస్ట్‌లను అభివృద్ధి చేయడం సులభమన్నారు. ఇది గ్రీన్ కెమిస్ట్రీ దిశగా ముందడుగు వేసినట్లని పేర్కొన్నారు. సీఈఎఫ్ఐపీఆర్ఏ డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్ సేథ్ మాట్లాడుతూ సీఫిప్రా ద్వారా భారత్ – ఫ్రాన్స్ మధ్య శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అనేక పద్ధతుల్లో మౌలిక సహకారం అందుతోందన్నారు. వివిధ దేశాల ప్రతినిధులు, వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్‌లు డీబీ రామాచారి, పిజ వెంకటేశు, మధుసూదన్, విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం జరిగింది. మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం... నాదెండ్ల మండలం సంకురాత్రి పాడు గ్రామానికి చెందిన నన్నం విజయ్ కుమార్ (35) భార్య గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై సంకురాత్రి పాడు నుంచి గుంటూరు వెళుతున్నారు. మార్గమధ్యలో పేరేచర్ల పరిధిలోని రవీంద్ర హోటల్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ సంఘటనలో విజయ్ కుమార్ తలకు తీవ్ర గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

## 266 పరుగులకు రాజస్థాన్ ఆలౌట్



హాఫ్ సెంచరీ చేసిన యశ్వంత్

మంగళగిరి: అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన విజయ్ మర్చంట్ ట్రోఫీ (అండర్ 16 మెన్) క్రికెట్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు 266 పరుగులకు ఆలౌటైంది. బుధవారం రాజస్థాన్, ఉత్తరాఖండ్ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు 82.01 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్‌లు యశ్వంత్ భరద్వాజ్ 8 ఫోర్లతో 50 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 5 ఓవర్లలో 8 పరుగులు సాధించింది.



## హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న గుంటూరు-ప్రకాశం జిల్లా జట్లు



బ్యాడ్మింటన్ ఆడుతున్న విజయవాడ- నరసరావుపేట జోడీలు

పెదకూరపాడు: జీఆర్‌సీఆర్‌కే చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో చైతన్య స్కూల్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. బ్యాడ్మింటన్ పోటీలను రాత్రి సమయంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. బ్యాడ్మింటన్ మోడలిస్ట్ విభాగంలో విజయవాడకు చెందిన వంశీ–రాహుల్, మునీర్–హేమంత్ జోడీల మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీలో వంశీ–రాహుల్ మొదటి విజేతగా నిలిచారు. మరో మ్యాచ్‌లో నరసరావుపేటకు చెందిన ధనుష్–ధీరజ్, విజయవాడకు చెందిన జితేంద్ర–నవీన్ మధ్య గట్టి పోటీ నెలకొంది. ధీరజ్–ధనుష్ విజేతలుగా నిలిచి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ నాన్ మోడలిస్టులో నరసరావుపేటకు చెందిన బాషా, చక్రీల జోడీ మొదటి స్థానంలో నిలిచింది. విజయవాడకు చెందిన జితేంద్ర, నవీన్ జోడీ రెండో స్థానం సాధించింది. విజయవాడకు చెందిన ప్రణయ్–మల్లి మూడో స్థానం, పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే చైతన్య స్కూల్‌కు చెందిన అరుణ్, దానం ల జోడీ 4 స్థానానికే పరిమితమైంది. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో లీగ్ దశలో 30 జట్లు పాల్గొనగా మద్దాల టీం, అంజి మెమోరియల్, గుంటూరు స్పైక్, సత్తెనపల్లి సైదాటీ టీంలు గెలుపొందాయి. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో ఒంగోలు జట్టు, బాపట్ల కర్లపాలెం జట్టు, వడ్లపల్లి కాటపాలెం జట్టు, గుంటూరు వికాస్ కాలేజీ టీం, పెదకూరపాడు జట్లు లీగ్ దశలో విజయం సాధించి ఫైనల్‌కు అర్హత పొందాయని నిర్వాహకులు కవిత, రాము తెలిపారు.



వాలీబాల్ పోటీలో ప్రకాశం-బాపట్ల జట్లు

## ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: పాఠశాల తరగతి గదిలో నిద్రించిన ఉపాధ్యాయుడికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.వి. నారాయణ మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో ఉన్న విద్యార్థులను పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రంలోనికి పంపి, పాఠశాల తరగతి గదిలో నిద్రిస్తున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'గుర్రువు గారూ ఇది తగునా..!' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఎంఈవోలు సీహెచ్. రమాదేవి, జి. లీలారాణిలు విచారణ జరిపి డీఈవోకు నివేదిక అందించారు. హెచ్‌ఎం కొంత అస్వస్థతకు గురై, ఆరోగ్యం సహకరించక విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచి విశ్రాంతి తీసుకున్నారని, ఈ మేరకు అంగన్‌వాడీ సహాయకురాలు లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చారని నివేదికలో పేర్కొన్నారు. దీంతో ఎంఈవోలు ఇచ్చిన నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసుతోపాటు ఆర్టికల్స్ ఆఫ్ చార్జెస్ కూడా జారీ చేసినట్లు డీఈవో సి.వి. రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## వర్సిటీ జట్టుకు 'కృష్ణవేణి' విద్యార్థులు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని తదితరులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్‌లో కృష్ణవేణి కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు బుధవారం తెలిపారు. చోడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన తమ విద్యార్థులు ఎ.ఉమామహేశ్వరరావు, జె.నితిన్‌కిరణ్, జె.కళ్యాణ్‌కుమార్, పి.సాహిత్‌సింగ్‌లు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వెల్లడించారు. ఈ నెల 18 నుంచి 22 వ తేదీ వరకు కేరళ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఈ విద్యార్థులు ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, ప్రిన్సిపల్ నాతాని, అధ్యాపకులు అభినందించారు.

## కుంకలగుంటలోని ఆలయంలో చోరీ



ఆలయంలో చోరీ జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు



ఆలయం వెనుక భాగంలో పగులగొట్టి ఉన్న హుండీలు

నకరికల్లు: కుంకలగుంటలోని శ్రీకార్యసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ కథనం ప్రకారం.. ఆలయంలో శనివారం రాత్రి పూజలు ముగించుకున్న పూజారి కారంపూడి రాఘవాచార్యులు ప్రధాన గేటుకు తాళాలు వేసి వెళ్లారు. బుధవారం ఉదయం 6గంటల సమయంలో ఆలయ ప్రాంగణం శుభ్రం చేసేందుకు వచ్చిన మహిళకు గేటు తాళాలు పగలగొట్టి ఉండడంతోపాటు రెండు హుండీలు పగులగొట్టి ఆలయం వెనుక భాగంలో కన్పించడంతో ఆలయ నిర్వాహకులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనాస్థలానికి పోలీసులతోపాటు క్లూస్‌టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. ప్రధాన గేటు తాళాలు పగులగొట్టిన దుండగులు ఆలయంలోని రెండు హుండీలను వెనుకభాగానికి తీసుకువెళ్లి అందులోని సుమారు రూ.45 వేలు అపహరించారు. అక్కడి నుంచి వెళ్తూ ఆలయానికి కొద్దిదూరంలోనే ఇంటి వద్ద నిలిపి ఉన్న బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ కూడా అపహరించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

## స్కేటింగ్‌లో మెరిసిన చిన్నారులు



గోల్డ్ మెడల్ సాధించిన మెరుగుపాల ఆశిష్



సందు కోటేశ్వర్

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్‌కు చెందిన బాలుడు మెరుగుపాల ఆశిష్, ఉండవల్లికి చెందిన విద్యార్థి సందు కోటేశ్వర్ స్కేటింగ్‌లో ప్రతిభ చాటారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు. స్థానికులు బుధవారం వారిని అభినందించారు. డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల ఆశిష్ 11, 14 సంవత్సరాల వయస్సు కలిగిన స్కేటింగ్ కేటగిరీలో జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. సందు కోటేశ్వర్ 9–11 సంవత్సరాల విభాగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. మూడు సంవత్సరాల నుంచి కోటేశ్వర్ జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పతకాలు సాధిస్తూ తన సత్తా చాటుతున్నాడు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



కార్యాలయంలో డెప్యూటీ డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. బుధవారం వారు లింగంగుంట్లలోని 200 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం డెప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతికి వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూ ప్రారంభించకపోవడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. రోగులకు మందులూ అందుబాటులో లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రోగులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటానాయక్ మాట్లాడుతూ రోగులకు సరైన వైద్యం అందడం లేదని విమర్శించారు. రోగులను గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే అనుభవజ్ఞులైన వైద్య సిబ్బందిని ఇక్కడ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఏఐ రాకతో ఫార్మా పరిశోధనలు విస్తృతం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ... జనాభాకు అనుగుణంగా మారుతున్న ఆహార అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటిని ప్రజలకు తెలియపరచడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలన్నారు. మెరుగైన ఔషధాలను తయారు చేయాలని సూచించారు. ముఖ్య వక్తగా మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న మంగళయాటన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జన్యు లోపాల వల్ల కలిగే రుగ్మతలకు ఆధునిక చికిత్స చేయవచ్చునని పేర్కొన్నారు. కృత్రిమ మేధతో ఆధునిక పరిశోధన రంగం వేగవంతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ.బాలకృష్ణ మాట్లాడుతూ.. సాంకేతికత వల్ల దుష్ప్రయోజనాలను వివరించారు. సమాజాభివృద్ధికి తోడ్పడే ఆవిష్కరణలు చేయవచ్చునని తెలిపారు. బెంగళూరులోని అల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎండీ సలాహుద్దీన్ ఔషధాల అభివృద్ధి ప్రక్రియ వేగవంతమైందని వివరించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు అనుబంధ కళాశాల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.ప్రమీల రాణి అధ్యక్షత వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, కో కన్వీనర్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.సుజన, కోశాధికారి డాక్టర్ కేతు ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.మస్తానమ్మ, కె. విజయ్ కిషోర్, తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె .వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి

గుంటూరు రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారిని ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో కారులో తీసుకెళ్లి అనంతరం దాడి చేసిన ఘటనపై నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. చల్లావారిపాలెంకు చెందిన ఇమాబత్తిన నాగేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతనిని నల్లపాడుకు చెందిన నాగిరెడ్డి, అతని అనుచరులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి గ్రామ శివారులో డబ్బులు డిమాండ్ చేశారు. లేవని చెప్పడంతో దాడి చేశారు. తప్పించుకున్న నాగేశ్వరరావు జీజీహెచ్‌లో చికిత్స పొందారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జీడీసీఏకు తాత్కాలిక కమిటీ నియామకం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు ముగ్గురు సభ్యుల తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఏసీఏ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న కమిటీతోపాటు గతంలో ఉన్న కమిటీల మధ్య కొంత వివాదం నేపథ్యంలో గత నెల 29, 30వ తేదీల్లో ఏసీఏ విచారణ జరిపింది. దీంతో వివాదాలు పరిష్కారమయ్యే వరకు గుంటూరుకు చెందిన మాజీ రంజీ, దేవదర్ ట్రోఫీ క్రికెటర్లు వేముల మనోజ్ సాయి, బోడా సుధాకర్ యాదవ్‌తోపాటు న్యాయవాది, మాజీ క్రికెటర్ ఉమ్మడిశెట్టి మహతి శంకర్‌లను కమిటీ సభ్యులుగా నియమించింది. ఈ సందర్భంగా మనోజ్ సాయి, మహతి శంకర్‌లు మాట్లాడుతూ.. ఏసీఏ ఆదేశాల మేరకు తాము పనిచేస్తామన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్–12 బాలుర జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామన్నారు.



## ఉరుకులు పరుగులతో కట్టేతలు



నగరం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికందే తరుణంలో వాతావరణంలో మార్పులతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమవ్వడంతో కోతలు కోసిన రైతుల గుండెల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో 3వేల ఎకరాల్లో దాకా వరి పంట ఓదెల రూపంలో ఉంది. ఈ తరుణంలో కారు మబ్బులు పట్టి చిరు జల్లులు పడుతుండటంతో రైతులు హడావుడిగా కట్టేతలు కడుతున్నారు. దీంతో కూలీలు రేట్లు పెంచేశారు. ఎకరానికి రూ.7,000 నుంచి రూ.7500 డిమాండ్ చేస్తున్నారు.



కబడ్డీ ఆడుతున్న దృశ్యం



పరుగు పందేంలో మహిళలు

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

నగరంపాలెం: క్రీడా పోటీలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. నగరంపాలెం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్– గేమ్స్ మీట్ పోటీలను బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో నిమగ్నమయ్యే పోలీసులకు మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. నాయకత్వ లక్షణాలు కూడా అలవాటు అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటల్లో 8 విభాగాల (ఆరు సబ్ డివిజన్లు, ఏఆర్, హెడ్ క్వార్టర్ విభాగం–1) నుంచి సుమారు 150 మంది సత్తా చాటేందుకు పోటీ పడుతున్నారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.